# మార్పుతోనే ముందడుగు

- పాత నేరస్తుల్లో పరివర్తన తెచ్చేందుకు కార్యాచరణ
- రాచకొండ కమిషనరేట్ సీపీ డీఎస్ చౌహాన్

భువనగిరి కలెక్టరేట్, మే 10 : నేరప్రవృత్తిని విడిచిపెడితే మనిషిలో వచ్చే మార్పుతో సమాజంలో మంచి గుర్తింపు సంపాదించుకోవచ్చని రాచకొండ కమిషనరేట్ సీపీ డీఎస్ చౌహాన్ సూచించారు. రాచకొండ పోలీస్ ఆధ్వర్యంలో పాత నేరస్తుల్లో మార్పును తీసుకువచ్చేందుకు నిర్వహించిన 'మార్పు కోసం ముందడుగు' కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని వైఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. వివిధ కారణాలతో నేరాలకు పాల్పడిన వారిలో పరివర్తన తీసుకు రావడమే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. ఒక సారి నేరం చేసిన వారి పట్ల సమాజం చిన్న చూపు చూస్తున్నదని, దానిని ఎదుర్కొని సమాజంలో తమకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేసుకునే దిశగా అడుగులు వేయాలన్నారు. అవగాహన సదస్సులో 400 మందికి పైగా పాత నేరస్తులు పాల్గొన్నారు. వారికి విద్యభూషన్, ప్రొఫెసర్ లక్ష్మీకుమారి, ప్రొఫెసర్ రాజ్‌కుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీసీపీ ఎం. రాజేశ్‌చంద్ర, డీసీపీ క్రైమ్ పి. మధుకర్‌స్వామి, అదనపు డీసీపీ క్రైమ్ ఏ.లక్ష్మి, లా అండ్ ఆర్డర్ భువనగిరి సబ్ డివిజన్, యాదాద్రి డివిజన్, చౌటుప్పల్ డివిజన్ ఏసీపీలు, సీసీస్ ఇన్‌స్పెక్టర్లు ఎస్. సైదయ్య, ఎస్. దేవేందర్, ఎస్ఐ రవీందర్, సీసీస్ సిబ్బంది పాల్గొన్నారు.



డీసీపీ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్





## ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తాం : సీపీ

ప్రతి ఒక్కరికీ న్యాయం చేయడమే పోలీసుల లక్ష్యమని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ అన్నారు. బుధవారం భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఫిర్యాదుదారులతో మాట్లాడారు. కమిషనరేట్ పరిధిలోని ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామన్నారు. సివిల్ వివాదాలకు పోలీసులు దూరంగా ఉంటారన్నారు. అలాంటి కేసులను కోర్టులోనే పరిష్కరించుకోవాలని సూచించారు. నేరాలకు పాల్పడి ఇతర రాష్ట్రాలకు పారిపోతున్న వారిని పట్టుకొని చట్టం ముందు నిలబెడుతున్నామని పేర్కొన్నారు. అనంతరం డీసీపీ ఆఫీస్‌లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన వెంట డీసీపీ రాజేశ్‌చంద్ర, ఏసీపీ వెంకట్‌రెడ్డి, భువనగిరి పట్టణ సీఐ, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# మార్పుతో ముందడుగు

## పరివర్తనతోనే సమాజంలో గుర్తింపు

**రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్**

**భువనగిరిలో వినూత్నంగా పాత నేరస్తులతో సమావేశం**

**హాజరైన 400 మంది.. నిపుణులతో అవగాహన**

7



పాత నేరస్తులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

# నేర ప్రవృత్తి వీడి సత్ప్రవర్తనతో జీవించండి

## ✦ సీపీ డీఎస్ చౌహాన్

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: తెలిసో తెలియక చేసిన నేరం మరోసారి చేయవద్దని సత్ప్రవర్తనతో జీవనం సాగించాలని సీపీ డీఎస్ చౌహాన్ సూచించారు. గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తులు, వారి కుటుంబ సభ్యులతో 'మన కోసం మనం' అనే అవగాహన కార్యక్రమం భువనగిరిలో బుధవారం వైఎస్‌ఆర్‌గార్డెన్‌లో నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ.. మళ్లీ నేరాల బారిన పడకుండా కుటుంబ కోసం గౌరవప్రదంగా ఉండాలని సూచించారు. అవసరమైన వారికి ఉపాధి పనులు చేసుకునేందుకు లయన్స్ క్లబ్ సహకారంతో శిక్షణ ఇస్తామన్నారు. డీసీపీ రాజేష్‌చంద్ర మాట్లాడారు. 415 మంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం కార్యక్రమానికి వచ్చిన వ్యక్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో క్రైం డీసీపీ మధుకర్ స్వామి, అడిషినల్ డీసీపీ ఎ.లక్ష్మి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు విద్యాభుషన్, రాజ్‌కుమార్, లక్ష్మీకుమారి, ఏసీపీలు వెంకట్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, ఉదయ్‌రెడ్డి పాల్గొన్నారు.

● వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుల స్వీకరణ, వాటి పరిష్కారంలో స్టేషన్ ఎస్‌హెచ్‌వోలు నిర్లక్ష్యం చేయొద్దని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ సూచించారు. భువనగిరి శివారులోని ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో జిల్లా క్రైం సమావేశంలో డీసీపీ రాజేష్‌చంద్రతో కలిసి నేర నివేదికను సమీక్షించారు. భూవివాదాల జోలికి వెళ్లకుండా ఉండాలన్నారు. సమావేశంలో డివిజన్ ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ డీఎస్ చౌహాన్, వేదికపై డీసీపీ రాజేష్‌చంద్ర, క్రైం డీసీపీ మధుకర్‌స్వామి, అదనపు డీసీపీ లక్ష్మి

సాక్షి

# మార్పు కోసమే ముందడుగు



ఫిర్యాదుదారుల పిల్లలతో మాట్లాడుతున్న సీపీ డీఎస్ చౌహాన్, చిత్రంలో డీసీపీ రాజేశ్‌చంద్ర



కంట్రోల్ రూంను ప్రారంభిస్తున్న సీపీ

- పాత నేరస్తులు సత్ప్రవర్తనతో మెలగాలి
- రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

**భువనగిరి :** నేరస్తుల్లో మార్పు తీసుకువచ్చేందుకే 'మార్పు కోసం ముందడుగు' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ పేర్కొన్నారు. మంచి జీవితం కోసం పాత నేరస్తుల్లో మార్పు రావాలని సూచించారు. బుధవారం భువనగిరిలోని వైఎస్సార్ గార్డెన్‌లో రాచకొండ క్రైం విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన మార్పు కోసం ముందడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజం అభివృద్ధి జరగాలన్నా, శాంతిభద్రతలు అదుపులో ఉండాలన్నా నేరాలకు తావుండొద్దన్నారు. ఏ పరిస్థితుల్లో నేరం చేసినా నేరమేనన్నారు. నేరాలు జరగకుండా నేరం చేసిన వారు జీవితాంతం నేరస్తులుగానే ఉండిపోకుండా వారిలో మార్పు తీసుకువచ్చేందుకు ముందడుగు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఆస్తులు శాశ్వతం కాదని, అక్రమ మార్గంలో కాకుండా సక్రమ మార్గంలో సంపాదించుకోవాలనని సూచించారు. పాత నేరస్తులకు క్రైం శాఖ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు.

**మార్పుకోసం అవకాశం : డీసీపీ రాజేశ్‌చంద్ర**

మార్పుకోసం ప్రతి ఒక్కరికీ కాలం అవకాశం ఇస్తుందని డీసీపీ రాజేశ్‌చంద్ర అన్నారు. పాత నేరస్తుల్లో మార్పు తీసుకువచ్చి మంచి జీవనం గడిపేందుకు పోలీసు శాఖ కృషి చేస్తుందన్నారు. క్రైం డీసీపీ మధుకర్ మాట్లాడుతూ.. నేర వృత్తిని మానేసి సత్ప్రవర్తనతో జీవించేవారి పిల్లలకు గురుకుల పాఠశాలల్లో సీట్లు ఇప్పిస్తామన్నారు. పదేళ్ల వరకు ఎటువంటి నేరాలకు పాల్పడని వారిపై క్రైం షీట్లు తొలగిస్తామన్నారు. గతంలో నమోదైన కేసుల విషయంలో న్యాయం సహకారం అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమానికి పాత నేరస్తులు 415 మంది హాజరయ్యారు. సమావేశంలో మల్కాజిగిరి – భువనగిరి అడిషనల్ డీసీపీ లక్ష్మి, ఏసీపీలు వెంకట్‌రెడ్డి, ఉదయ్ కుమార్, నర్సింహారెడ్డి, సీఐలు సత్యనారాయణ, వెంకటయ్య, సైదయ్య, దేవేందర్, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది, లయన్స్ క్లబ్ చైర్మన్ విద్యాభూషణ్, లక్ష్మీకుమారి, రఘునాథరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

**ఫిర్యాదుదారులతో ముఖాముఖి**

భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌ను సీపీ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వారి నుంచి మళ్లీ ఫిర్యాదులు తీసుకున్నారు. అదే విధంగా డీసీపీ క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను సీపీ ప్రారంభించారు. అనంతరం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. దొంగతనాలను ఛేదించడంలో నైపుణ్యం కలిగి ఉండాలని, సివిల్ వ్యవహారాల్లో తలదూర్చవద్దని సూచించారు.

Date: 11/05/2023, Edition: Yadadri(Yadadri District), Page: 7
Source : https://epaper.sakshi.com/